క్లుప్తంగా

సిరులతల్లికి పంచామృతాభిషేకం



పంచామృతాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎస్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె.రాజేంద్రకుమార్, వేదపండితులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అమ్మవారి గాజుల అందజేత



అమ్మవారి గాజులు భక్తులకు అందజేస్తున్న ఈవో శోభారాణి

దాబాగార్డెన్స్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కనకమహాలక్ష్మి అమ్మవారిని గజలక్ష్మిగా అలంకరించి లక్ష గాజులతో పూజలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అమ్మవారి దర్శనార్థం గురువారం విచ్చేసిన భక్తులకు ఆ గాజులను ఆలయ ఈవో కె.శోభారాణి పంపిణీ చేశారు.


ఐదేళ్ల తర్వాత ఇంటికి చేరిన డ్రైవర్



క్షేమంగా ఇంటికి చేరిన సమీర్

దాబాగార్డెన్స్: ఒడిశాలోని కాందమల్ జిల్లా గిరుటి గ్రామానికి చెందిన సమీర్ మానసిక వ్యాధికి గురయ్యాడు. అంతకు ముందు సొంత ట్రక్కు నడుపుతూ కుటుంబాన్ని చక్కగా పోషించుకునేవాడు. మద్యం, టొబాకోకు బానిసయ్యాడు. ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నమై అప్పుల పాలయ్యాడు. ట్రక్కు అమ్మేశాడు. ఒత్తిడికి లోనై మానసిక అనారోగ్యానికి గురయ్యాడు. తల్లి, భార్య, ఏడాది కుమారుడిని వదిలి ఐదేళ్లుగా ఇళ్లు విడిచి తిరుగుతున్నాడు. గత ఏడాది అక్టోబర్‌లో ఏయూటీడీ సిబ్బంది సమీర్‌ను రెస్క్యూ చేసి షెల్టర్‌కు తరలించారు. శ్రద్ధా ఫౌండేషన్ మందులతో తొందరగా కోలుకోవడంతో వైజాగ్ నుంచి నేరుగా ఒడిశా తీసుకెళ్లి తల్లి, భార్యకు క్షేమంగా అప్పగించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



యూజీడీ పనులకు శంకుస్థాపన చేస్తున్న 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి

అల్లిపురం: జీవీఎంసీ 34వ వార్డు కొబ్బరి తోట ఎస్‌వీపీనగర్‌లో రు.13 లక్షల వ్యయంతో నిర్మించనున్న యూజీడీ పనులకు గురువారం వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో కొబ్బరి తోటలో నిర్మించిన యూజీడీ పైపులు శిథిలం కావడంతో కమిషనర్‌కు లేఖ రాసినట్టు తెలిపారు. ఆ పనులకు సంబంధించి ఇప్పుడు రూ. 13 లక్షలు మంజూరు కావడంతో పనులు ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఎర్నిమాంబ అమ్మవారి దేవస్థానం చైర్మన్ లింగం శ్రీనివాసరావు, దూడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నిలువెత్తు నిర్లక్ష్యం



అక్బర్ రెసిడెన్సీ వద్ద 15 రోజులుగా తవ్వి వదిలేసిన కాలువ



టౌన్ కొత్తరోడ్డు దరి ఒక వీధిలో సీసీరోడ్డు నిర్మించి వాటరింగ్ చేయకపోవడంతో సిమెంట్, రాళ్లు పైకి తేలిన దృశ్యం

- అభివృద్ధి పనులపై కొరవడిన అధికారుల చిత్తశుద్ధి
- పూర్ణామార్కెట్, టౌన్ కొత్తరోడ్డు ప్రాంతాల్లో సీసీ రోడ్లు వేసి కనీసం వాటరింగ్ కూడా చేయని వైనం
- సిమెంట్, రాళ్లు తేలి వేసిన సీసీ రోడ్లు శిథిలం
- వన్‌టౌన్‌లోని ఫ్రూట్‌మార్కెట్ వద్ద నిర్మించిన సీసీ ర్యాంప్‌దీ అదే పరిస్థితి
- అధికారుల తీరు పట్ల విస్తుపోతున్న స్థానికులు

జగదాంబ: జీవీఎంసీ జోన్–4లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల టౌన్ కొత్తరోడ్డు వద్ద కల్వర్టు పనులు చేశారు. రూ. లక్షల వ్యయంతో తలపెట్టిన కాంక్రీట్ పనుల తర్వాత కనీసం వాటరింగ్ చేసిన దాఖలాలు లేవని స్థానికులు వాపోతున్నారు. అదే ప్రాంతంలోని ఓ సీసీ రోడ్డు పరిస్థితి కూడా అలాగే ఉందంటూ ప్రజలు చెబుతున్నారు. వీటితో పాటు టౌన్ కొత్త రోడ్డులోని అక్బర్ రెసిడెన్సీ వద్ద ఓ కాలువ తవ్వి దాదాపు పదిహేను రోజులుగా వ్యర్థాలను రహదారి పైనే వదిలేయడంతో వాహన చోదకులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. దాంతో పాటు దుర్వాసన వ్యాపించి చుట్టుపక్కల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. రాత్రిపూట ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నట్లు ఆ ప్రాంత ప్రజలు వాపోతున్నారు.

రాళ్లు తేలిన సీసీ ర్యాంప్..

ఇటీవల వన్‌టౌన్‌లోని ఫ్రూట్‌మార్కెట్ వద్ద రూ. 20 లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ ర్యాంప్ సరైన నిర్వహణ లేకపోవడం వల్ల సిమెంట్, రాళ్లు తేలి రాకపోకలకు ఇబ్బందికరంగా తయారయింది. అక్బర్ రెసిడెన్సీ వద్ద నిర్మించిన సీసీ ర్యాంప్ పరిస్థితి కూడా ఇదే విధంగా ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల జోన్–4 కార్యాలయంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ సమీక్షా సమావేశాలు నిర్వహించి సక్రమంగా విధులు నిర్వహించాలని, అభివృద్ధి పనులపై ఎప్పటికప్పుడు అధికారుల పర్యవేక్షణ ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. కానీ ఇంజినీరింగ్ విభాగంలో అటువంటిదేమీ కనిపించడంలేదని పలువురు ఆక్షేపిస్తున్నారు.



వాటరింగ్ చేయకపోవడం వల్ల సిమెంట్, రాళ్లు తేలిన ఫ్రూట్ మార్కెట్‌లో ఇటీవల నిర్మించిన సీసీ ర్యాంప్

కాలువ దాటలేకపోతున్నాం..



కాలువలు నిర్మించేందుకు గోతులు తీసి నెలరోజులు అవుతోంది. రోడ్డును తవ్వి వదిలేయడంతో రోజు ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి. వయసు మళ్లిన వారు కాలువ దాటి ఇళ్లలోకి వెళ్లలేకపోతున్నారు. పిల్లలు పడిపోతున్నారు. తక్షణం తీసిన గోతులు మూయించాలి.

– చిన్నారావు, లాండ్రీ షాపు, అక్బర్ రెసిడెన్సీ దరి

ఒక్కరోజు కూడా వాటరింగ్ చేయలేదు..



టౌన్ కొత్తరోడ్డు, ఫ్రూట్ మార్కెట్ వద్ద సీసీ రోడ్లు నిర్మించారు. కానీ ఒక్కరోజు కూడా వాటరింగ్ చేసిన పాపాన పోలేదు. ఇటీవల అడపా దడపా కురుస్తున్న వర్షాలకే ఆ రోడ్లు తడిసాయి. అధికారులు పట్టించుకోకపోవడం వల్ల వేసిన రోడ్డు, సీసీ ర్యాంప్ సిమెంట్, రాళ్లు తేలి శిథిలమైపోతున్నాయి.

– వెంకటేష్, టౌన్ కొత్తరోడ్డు

పరిశీలించి చర్యలు తీసుకుంటాం..



పాతనగరంలోని పనులను పరిశీలిస్తాం. ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తాం. జరగబోయే పనులకు వర్క్ ఇన్‌స్పెక్టర్‌ను ఏర్పాటు చేసి పనులు చేయిస్తాం. గతంలో జరిగిన పనులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

– ఎం. మల్లయ్యనాయుడు, జోన్–4 కమిషనర్

వాసుపల్లి ఔదార్యం



రామకృష్ణకు ఆర్థిక సాయం చేస్తున్న వాసుపల్లి

దాబాగార్డెన్స్: మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ ఓ వైపు పార్టీని బలోపేతం చేస్తూ.. మరోవైపు ప్రజాసేవలో నేనున్నానంటూ భరోసా కల్పిస్తున్నారు. జీవీఎంసీ 31వ వార్డు కనకలవీధికి చెందిన కాగిత రామకృష్ణ లివర్, ఊపిరితిత్తుల సమస్యతో గత కొంతకాలంగా మంచం పట్టాడు. వార్డు అధ్యక్షుడు దొడ్డి బాపూ ఆనంద్ ద్వారా విషయం తెలుసుకున్న వాసుపల్లి కాగిత రామకృష్ణ ఇంటికి నేరుగా వెళ్లి వైద్య ఖర్చుల కోసం రూ.5 వేల ఆర్థిక సాయం చేశారు. అతని కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. కార్యక్రమంలో పెంటకోట నాగరాజు, కోడూరు కనకరాజు, పెంటకోట బాబూరావు, కాంట్రేగుల నాయుడు, గంటా శ్రీను, రాము మాస్టార్, దినేష్, మహేష్, కనుకులు, కొండ రామ, దుర్గా, సంతోష్, ఆరుగుల రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్లైవుడ్ ముఠా కార్మికుల కూలీ రేట్లు పెంచాలి

దాబాగార్డెన్స్: ప్లైవుడ్ ముఠా కార్మికుల కూలీ రేట్లు పెంచాల్సి ఉందని, కానీ నాలుగేళ్లయినా యాజమాన్యాలు ఆ దిశగా చర్యలు తీసుకోలేదని సిటు జగదాంబ జోన్ కార్యదర్శి ఎం.సుబ్బారావు తెలిపారు. ఈ అంశంపై కార్మిక శాఖ కార్యాలయం వద్ద గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ నిత్యావసర వస్తువులు, ఇంటి అద్దెలు, స్కూల్ ఫీజులు, రవాణా చార్జీలు పెరిగిపోయాయని, అనారోగ్యంతో మంచాన పడితే మందులు కొనుగోలు చేయలేని పరిస్థితి ఉందన్నారు. కూలీ రేట్లు పెంచాలని డీసీఎల్‌కు రెండు నెలల కిందట విన్నవించుకున్నా కార్మికుల బాధలు వారికి పట్టడం లేదన్నారు. కార్యాలయానికి వెళ్లినా అందుబాటులో ఉండడం లేదని, ఇప్పటికైనా డీసీఎల్ యాజమాన్యాలతో మాట్లాడి జాయింట్ మీటింగ్ పెట్టి ప్లైవుడ్ ముఠా కార్మికుల కూలీ రేట్లు పెంచేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో వై.రాజు, చిన్నారావు, వెంకట్రావు, చంటి, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ స్వర్ణోత్సవాల విస్మరణ తగదు



మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

దాబాగార్డెన్స్: సమీకృత శిశు అభివృద్ధి పథకం 1975లో ప్రారంభమైందని, ఈ పథకం వల్ల యావత్ దేశంలో పేద మహిళలు, పిల్లల జీవితాల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ అన్నారు. గురువారం సిటు కార్యాలయంలో జరిగిన యూనియన్ విశాఖ జిల్లా సదస్సులో ఆమె మాట్లాడారు. ఆ పథకం స్వర్ణోత్సవాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించడం తగదన్నారు. ఈ పథకం వల్ల ఎంతో మేలు జరుగుతుందని పలు నివేదికలు స్పష్టం చేసినా ప్రభుత్వాలు ఉద్దేశపూర్వకంగానే ఆ పథకాన్ని విస్మరిస్తున్నట్టు కనపడుతోందని ఆరోపించారు. కీలకమైన ఐసీడీఎస్ పథకానికి మోదీ ప్రభుత్వం బడ్జెట్ తగ్గించడం ద్వారా నిర్వీర్యం చేయడాన్ని తక్షణం ఆపాలని డిమాండ్ చేశారు. యాప్‌ల పేరిట అర్హులైన వారిని తొలగించే ప్రయత్నం జరుగుతోందన్నారు. ఐసీడీఎస్‌లో కీలకంగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అంగన్‌వాడీలకు జీతాలు పెంచని కారణంగా కేంద్ర మంత్రుల కార్యాలయాల వద్ద నవంబర్‌లో పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. లబ్ధిదారుల సంఖ్య కుదించవద్దని నవంబర్ 14న చిన్న పిల్లలతో అన్ని జిల్లాల్లో ధర్నాలు చేయాలని తెలిపారు. సిటు అఖిల భారత మహాసభలు విశాఖలో జరుగుతున్న నేపథ్యంలో వాటి విజయవంతానికి అంగన్‌వాడీలంతా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవి, గౌరవ అధ్యక్షురాలు మణి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.శోభారాణి, నాయకులు కె.బృందావతి, పద్మావతి, శ్రీదేవి, తులసి, సాయి సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

నర్సుల సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న నర్సుల సంఘం అధ్యక్షురాలు భవానీ, కార్యదర్శి వరలక్ష్మి

మహారాణిపేట: నర్సులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఏపీ ప్రభుత్వ నర్సుల సంఘం జిల్లా అధ్యక్షురాలు భవానీ, కార్యదర్శి వరలక్ష్మి కోరారు. గురువారం అనకాపల్లి జిల్లా డీఎంహెచ్‌వోను కలిసి పలు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. అలాగే డీసీహెచ్‌ను కూడా కలిసి నర్సుల సమస్యలపై వినతిపత్రం ఇచ్చినట్టు అసోసియేషన్ అధ్యక్షురాలు భవానీ తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న నర్సులు కూడా వివిధ సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని, ఈ సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోరారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే అట్రాసిటీ కేసుల పెరుగుదల



మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి

దాబాగార్డెన్స్: రాష్ట్రంలో అట్రాసిటీ కేసులు పెరుగుతున్నా.. కూటమి ప్రభుత్వానికి చీమ కుట్టినట్టయినా లేదని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి ఆరోపించారు. ప్రభుత్వ రంగం–సామాజిక న్యాయం పేరిట గురువారం సిటు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో దళితులు, గిరిజనులు, బలహీనవర్గాలపై నానాటికీ దౌర్జన్యాలు, లైంగిక దాడులు, గ్రామ బహిష్కరణలు యథేచ్ఛగా జరుగుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. మంత్రుల నియోజకవర్గాల్లో అట్రాసిటీ కేసులు నమోదవుతున్నా పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ రంగంలో ఒక్క పరిశ్రమ కూడా నిర్మించకపోగా ఉన్న శాశ్వత ఉద్యోగాలు తొలగించడం, బీజేపీ అధికారంలోకి వచ్చి 12 ఏళ్లయినా ఒక్క రిక్రూట్‌మెంట్ కూడా జరగలేదన్నారు. రిజర్వేషన్లు ఒక్క ప్రభుత్వ రంగంలోనే ఉన్నాయని, ప్రభుత్వ రంగాన్ని కాపాడుకుంటూనే ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల కోసం కృషి చేసినప్పుడే సామాజిక న్యాయం అమలవుతుందని చెప్పారు. సిటు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్‌కేఎస్‌వీ కుమార్ మాట్లాడుతూ సామాజిక న్యాయం ఒక్క ప్రభుత్వ రంగంతోనే సాధ్యమవుతుందని, ప్రైవేట్ కంపెనీలు వారి లాభాల పైనే దృష్టి పెడతారన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎం.సుబ్బన్న, ప్రధాన కార్యదర్శి టి.చిరంజీవి, ఉపాధ్యక్షుడు వై.రాజు, విశాఖ జిల్లా పబ్లిక్ సెక్టార్ కో ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ అన్నసమారాధన సత్రం ఏర్పాటుకు వినతి



ఉప కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

దాబాగార్డెన్స్: సింహాచలం వరాహ నరసింహ స్వామి దేవస్థానం (సింహాచలం కొండపై) విశ్వకర్మ (విశ్వబ్రాహ్మణ) అన్నసమారాధన సత్రం ఏర్పాటుకు ఆలయ పరిసర ప్రాంతంలో కొంత స్థలం కేటాయించాలని విశాఖ జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు గురువారం దేవదాయ శాఖ ఉప కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. గతంలో శ్రీశైలం మహా పుణ్యక్షేత్రంలో అన్నసమారాధన సత్రం నిర్మించారని, అదే విధంగా విశాఖలో సింహాచలం కొండపై సత్రం నిర్మించి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆశీర్వాదంతో అప్పన్న స్వామి భక్తులకు సేవ చేయాలని తీర్మానించామని, సత్రం కోసం కొంత స్థలం కేటాయిస్తే జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం తరపున సొంత నిధులతో భవన నిర్మాణం చేపట్టి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని ఆ వినతిలో పేర్కొన్నారు. ఉప కమిషనర్‌ను కలిసిన వారిలో విశ్వబ్రాహ్మణ సాధికారత కమిటీ కన్వీనర్, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గోడి నరసింహాచారి, సంఘం అధ్యక్షుడు శివకోటి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి గిడిజాల పార్వతీశం, వర్కింగ్ ప్రెసిడెంట్ పక్కి కొండబాబు, జిల్లా అధికార ప్రతినిధి కర్రి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు రాయల లక్ష్మణరావు, జాయింట్ సెక్రటరీలు బంగారు సురేష్, గుత్తికొండ గంగాధర్, శ్రీమంతుల వీరాచారి, గోలి వీరభద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులే దిక్సూచి

- బీజేపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు పరశురామ రాజు

దాబాగార్డెన్స్ : జర్నలిస్టులే పాలకులను సరైన మార్గంలో నడిపించే దిక్సూచులని బీజేపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్ పరశురామరాజు పేర్కొన్నారు. జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ విశాఖ జిల్లా ఆధ్వర్యంలో యూనియన్ సభ్యులకు గురువారం గుర్తింపు కార్డుల పంపిణీ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులు నిర్వహించే బాధ్యత పైనే ప్రజాస్వామ్యం మనుగడ ఆధారపడి ఉంటుందన్నారు. జాప్ విశాఖ అధ్యక్షుడు కీర్తన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జర్నలిస్టులకు రైలులో ప్రయాణానికి రాయితీతో కూడిన పాసులు పునరుద్ధరించాలని కోరారు. పాత్రికేయులకు కూటమి ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జాప్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి జేవీకే అప్పలరాజు, గంట చంద్రశేఖర్, ఉదయ్‌కుమార్, దానేష్, సందీప్, పృథ్వీరాజ్, సాయికుమార్, నాయుడు, శ్రీనివాసరావు, రాజు, శంకర, సురేష్, సతీష్, శ్రీనివాస్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే కఠిన చర్యలు



స్పెన్సర్స్ జంక్షన్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు ఆదేశాలు జారీ చేస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్



29వ వార్డులో పారిశుధ్య సిబ్బంది హాజరు పరిశీలిస్తున్న కమిషనర్

- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

దాబాగార్డెన్స్: రోడ్ల పైన, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ తెలిపారు. ప్రతి ఇంటి నుంచి రోజువారీ చెత్తను క్లాప్ వాహనాలకు మాత్రమే అందజేసి, నగర పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలన్నారు. క్షేత్ర పర్యటనలో భాగంగా గురువారం జోన్–3, జోన్–4 పరిధి 17, 20, 22, 29 వార్డుల్లో పారిశుద్ధ్యం, పరిశుభ్రత పనులను కమిషనర్ పరిశీలించారు. జోన్–3 పరిధి మద్దిలపాలెం జంక్షన్ నుంచి స్పెన్సర్స్ జంక్షన్ వరకు రోడ్డుకిరువైపులా పరిశుభ్రత పనులను పరిశీలిస్తూ, స్పెన్సర్స్ జంక్షన్ పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న టిఫిన్ సెంటర్ వద్ద రోడ్డు పక్కన చెత్త పేరుకుపోయినట్టు కమిషనర్ గమనించి అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటన చెత్త తొలగించి, బాధ్యులైన దుకాణ యజమానులపై జరిమానా విధించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. శుభ్రత పాటించకపోవడం, దుకాణం ముందు చెత్త బుట్టలు పెట్టకపోవడంపై ఆయన దుకాణ యజమానిని ప్రశ్నించారు. ఇలాంటి నిర్లక్ష్యం మరలా గనుక జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం 17, 20 వార్డుల పర్యటనలో భాగంగా పెదవాల్తేర్ గాంధీ సెంటర్ వద్ద రోడ్డు పక్కన కూరగాయల చెత్త వేస్తూ, పశువులకు ఆహారం పెడుతున్న వ్యక్తిని గమనించిన కమిషనర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే ఆ చెత్త తొలగించి ప్రదేశాన్ని శుభ్రపరచాలని ఆదేశించారు. నివాసితులు, వ్యాపారులు తమ చెత్తను క్లాప్ వాహనాలకు మాత్రమే అందజేయాలని, వాడి పారేసిన కప్పులు, ఇతర వ్యర్థాలు రోడ్లపై వేయరాదని సూచించారు. జోన్–4 పరిధి 29వ వార్డు దండుబజార్ వద్ద జీవీఎంసీ వార్డు కార్యాలయాన్ని సందర్శించి, పారిశుధ్య సిబ్బంది హాజరు పరిశీలించారు. సిబ్బంది బాధ్యతగా తమ పనులు నిర్వర్తించి నగర పరిశుభ్రతకు సహకరించాలని సూచించారు. సమయానికి డ్యూటీకి హాజరు కావాలని, శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సెక్రటరీలు రోజువారీ పర్యవేక్షణ చేపట్టి, నగరాన్ని చెత్త రహితంగా ఉంచాలని ఆదేశించారు. వాకీ టాకీ ద్వారా జోనల్ కమిషనర్లు సంబంధిత ప్రాంతాల్లో సిబ్బంది, క్లాప్ వాహనాలు సక్రమంగా వినియోగించి, ప్రతిరోజూ పరిశుభ్రతపై పర్యవేక్షించాలని ఆదేశాలు జారీ చేశారు.

24, 25 తేదీల్లో యువజనోత్సవాలు

కంచరపాలెం: జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ఈ నెల 24, 25 తేదీల్లో ఎక్సెల్సియర్–25 యువజనోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ తెలిపారు. కళాశాల ఆవరణలో గురువారం ఎక్సెల్సియర్ పోస్టర్, బ్యానర్లను ఆవిష్కరించారు. ఏయూ పరిధిలోని కళాశాలల విద్యార్థులు రెండు రోజుల పాటు జరిగే యువజనోత్సవాలకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కో–ఆర్డినేటర్ డాక్టర్ సుధ కోరారు. 2016 నుంచి కళాశాల నిర్వహిస్తున్న వార్షిక విద్యార్థి ఉత్సవాల్లో ఇది భాగమని చెప్పారు. ఆర్థికంగా వెనుకబడిన, తెలివైన విద్యార్థులు చదువుల్లో ముందుండాలనే ఆశయంతో ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. వివిధ కళాశాలల నుంచి సుమారు 3 వేల మంది విద్యార్థులు వేడుకలకు హాజరవుతారని కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.కె.జయలక్ష్మి తెలిపారు. 25వ తేదీ సాయంత్రం 4 గంటలకు జరిగే ముగింపు ఉత్సవాల్లో పలువురు ప్రముఖులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఎక్సెల్సియర్ కమిటీ ప్రతినిధులు డాక్టర్ సుజాత, సోనీ, ప్రవీణ్, డాక్టర్ కోటేశ్వరరావు, సిస్టర్ దీపాలి, ఊర్మిళ, ప్రత్యూష్, జయలక్ష్మి, స్టూడెంట్ కౌన్సిల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బంగారయ్యకు జాతీయ నంది పురస్కారం



అతిథుల చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న బంగారయ్య మాస్టారు

అల్లిపురం: కండిపల్లి బంగారయ్య (రాజు మాస్టారు) భజన గాయక కళాకారుడిగా 20 ఏళ్లుగా ప్రతి దైవ కార్యక్రమంలో విశిష్ట సేవలందిస్తున్నారు. అనేక ఆలయాల్లో జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భజనలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్, తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ నంది అవార్డు పురస్కారం ప్రదానం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు వెలుగు రాష్ట్ర చైర్మన్ పోలోజు రాజకుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్ పండా, బ్రహ్మశ్రీ డాక్టర్ దైవజ్ఞ శర్మ, రాష్ట్ర జాతీయ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ రంగిశెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై బైక్ ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: జీఎస్టీ 2.0పై అవగాహన కల్పిస్తూ గురువారం నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీఎస్టీ సంస్కరణల వల్ల సామాన్య ప్రజలకు కలిగే సూపర్ సేవింగ్స్ గురించి విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. సుమారు 100కు పైగా వాహనాలు పాల్గొన్న ఈ ర్యాలీ కలెక్టరేట్ నుంచి బయలుదేరి.. ఆర్కే బీచ్, ది పార్క్ హోటల్ మీదుగా ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానానికి చేరుకుంది. యువత ఉత్సాహంగా బైక్‌లు నడుపుతూ 'సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్'గురించి నినాదాలు చేస్తూ ప్రజల్లో చైతన్యం కల్పించారు. జిల్లా రవాణా శాఖ అధికారి ఆర్.సి.హెచ్. శ్రీనివాసరావు, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ దుష్యంత్, రవాణా శాఖ ఇతర అధికారులు పాల్గొన్నారు.

బీచ్ రోడ్డులో సీపీఆర్‌పై అవగాహన ర్యాలీ



ఆర్కే బీచ్‌లో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న సీపీ శంఖబ్రత బాగ్చీ, వైద్యులు

మహారాణిపేట: ప్రపంచ ఎనస్థీషియా దినోత్సవం, సీపీఆర్ అవగాహన వారోత్సవం సందర్భంగా కాళీమాత ఆలయం సమీపంలోని బీచ్ రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. అనస్థీషియా సొసైటీ, ఆంధ్ర మెడికల్ కాలేజ్ అనస్థీషియా, ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని సీపీ శంఖబ్రత బాగ్చి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీవ్రస్థాయి రోగులకు చికిత్స అందించడంలో అనస్థీషియాలజిస్టులు, అత్యవసర వైద్యులు చేస్తున్న కృషిని ప్రశంసించారు. సీపీఆర్ శిక్షణను సంవత్సరంలో ప్రతిరోజూ నిర్వహించాల్సిన అవసరం ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎస్ఎం సంధ్యా దేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ. వాణి, విశాఖ అనస్థీషియా సొసైటీ అధ్యక్షురాలు డాక్టర్ కె. అపరంజి, కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్ కుమార్, కేజీహెచ్‌లో అనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ కె. శ్రీలక్ష్మి సహా పలువురు ప్రముఖ అనస్థీషియాలజిస్టులు, ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం ప్రొఫెసర్లు, ఇతర వైద్యులు పాల్గొన్నారు.